౨౩౨

# కర్టెన్ లెక్చర్స్ (3)

కొంతల కాటుక కన్నుల అందం. అబ్బ: ఏవందవంటి మీ ముక్కుకి కోపం? అద్దం తెచ్చి చూపనా? వద్దూ మొహం అలా తిప్పేసుకోకండి. చూడనివ్వరూ. పోనీ చేతులడ్డం పెట్టేసుకోకండి మినిట్లో చేసి తీసుగొస్తాను కాఫీయా, టీయా, కోకోవా.... అఖ్ఖర్లేదూ.. అలిగారా స్వామీ! "అలుగుట ఎందుకు మీరూ అంబుజ దళనయనా." పాట లొస్తున్నాయండోయ్ జాగర్త!

బెడ్రూంలో చీదకండి ఐ అబ్జెక్ట్ యువరానర్! జలుబా, కోపమా? తెలియలేదండి నాకు. మీకు తెలుసు కోపం - నవ్వండి, నవ్వరూ - నవ్వుల పువ్వులు రువ్వే పడగ్గదిలో. అంతలా రుస రుసలూ బుస బుసలూ పనికి రావండి. ఎవరితోనేనా పోట్లాడి వచ్చారా? వస్తాను, నాకు తెలియదూ- కోపం మీకు ముక్కు మీదుంటుంది. అద్దం తేనా- మీ ముక్కు అందం మీకెలా తెలుస్తుంది చెప్పండి! గోడకి కేలండర్లు తగిలించానా? మీకిష్టం లేకపోతే ఆ కేలండర్లు ఆచార్లుగారమ్మాయి కిస్తాన్లెండి ఎగురుకుంటూ పట్టికెళ్తుంది మహచక్కా. చీదకండి! బెడ్రూంలో చీవొద్దని రూలు.... అహ్హా ఏవీలేదు, జాగాలేక తరవాత సర్దచ్చుకదా అని మీ అలక పానుపు కింద "కొత్త చింతపండు" ఆ పెట్టా తప్పా, తప్పున్నరా అంటారా? బాగుచేసి డబ్బాల్లో పోసుకునేదాకా ఆగలేరూ....బాగుందండీ సరసం! మీరేంతక్కువా? మీ కుళ్ళు సాక్సు, చెప్పులు జోళ్ళు, బూడ్సూ తెచ్చి మంచంక్రింద విడవద్దంటే మానారూ! తడి తువ్వాళ్ళు, కుళ్ళుబనీన్లూ మంచంమీద విడవద్దంటే విన్నారూ! రేడియోమీద సిగరెట్టుపెట్టి అగ్గి పెట్టె పెట్టొద్దండీ అని బతిమాలినా వినరు. తడికాళ్ళతో మంచంమీద కూర్చోడం, నిద్రలో పక్కమీద దుప్పటిలాగి కప్పుకోడం, మంచినీళ్ళ గ్లాసులో చేతులు ముంచడం. ఇడ్లీ తిన్నాక వేళ్ళకంటిన పచ్చడి నాకడం. ఇస్త్రీ బట్టలు తొడుక్కుని భాసింపట్టు వేసుక్కూర్చోడం అండర్ వేర్తో వండర్‌ఫుల్‌గా వరండాలో పచార్లు చేయడం. గడ్డం చేసుకునే సామాను గాడ్రేజ్ బీరువాలో పెట్టడం. మా ఊరినుంచి వచ్చిన ఉత్తరాల్ని మడిచి జేబులో పెట్టడం, ఈ డం డం లన్నీ మీరు మానారూ? మనం సర్దాగా రిక్షాలో కూర్చుని "గాలిని తేలుచు సోలిపోవుచును" సినిమాకెళ్తే దారిలో రిక్షావాడితో గసిప్ కొట్టకండి బాబూ అంటే ఎన్నడైనా....ప్చ్! మాటా

డరూ-నిజం కోపమే! ఉష్! కాకీ పోయిందా-పోదేమూ - ఏం మనుష్యులమ్మా? కొయ్యలు! సబుఫూ సందర్భంలేకుండా కోపాలు వెలిగిస్తే తీర్చడానికిదేం అత్తారిల్లు కాదండోయ్! మీ కోపం మీ అత్తారింట్లో చూపించుకోండి. నా దగ్గరకాదు. నాకసలు చిరాకేస్తే మీరు అరిచి "గీ" పెట్టినా మాట్లాడ్ను. ఏమనుకున్నారో- దేనికైనా హద్దూ పద్దూ వుండాలి. వేయించిన సెనగపప్పూ, కొబ్బరుండలూ, పప్పుచెక్కలు, మరమరాలూ కొన్నా. నా ప్రాణం విసిగించారంటే అవన్నీ వాళ్ళో పోసుగుని నేనొక్కదాన్నే తినేస్తా. తినేసి హాయిగా సినిమాపాటలు జ్ఞాపకం చేసుకొంటూ బియ్యప్పిండి జల్లిస్తా. మీకు "టీ" చుక్కకూడా పొయ్యను. మీ పర్సులో నలభై రూపాయలు పోయాయా - అమ్మ బాబో .... ....ఆ సొమ్మంతా నేను తీశానంటారేమిటి కొంపదీసి. నాలుగు వేలు పోసి కొనుక్కున్న నా దేవుడు నా కుండగా ముష్టి నలభై రూపాయలు నా కెందుకు? అందుకే మీ పెట్టె నన్ను ముట్టుకోవద్దంటారా? నా కెందుకు- మావాళ్ళిచ్చిన భోషాణంలాటి బొకిపెల పెట్టె వుండగా (అది వెనక స్టేషన్లో కూలివాడి కెత్తబోయి నపుడు మీ కాలిమీద పడితే, మూడ్రోజులు కుంటు కుంటూ తిరిగారుగా) పడవలా అందులో ఎంత పంసారమైనా పడ్తుంది. నా చీరెలూ నగలూ; పన్నీరుబుడ్డి గంధపుగిన్నె. అన్నీ అందులో ఇముడ్తాయి. ఏదో పేరంటానికెళ్ళొచ్చి కొత్తచీర మడత పెట్టి ఆ మంచి అత్తరు గంధం సువాసనలు మీ సిగరెట్. ఘుగ ఘుగ రెట్. పొగ పొగ రెట్ వాసనలు పోతాయని మీ సూట్ కేస్‌లో పెట్టా.... అవి పెద్దతప్పొచ్చింది కాబోలు అయ్యగారికి. అంత బట్టలవాసనకూడా తగలరాదు కాబోలు. సర్లెండి! ఆ ఊరికీ వూరెంతో ఈ ఊరికావూరంతే. పోట్లాట వేసుకోవాలంటే నేనూ వేసుకోగల్ను- మీ సూట్ కేస్‌లో నావికొన్ని దాచా. అంతమాత్రాన దొంగతనం కట్టేస్తారూ నామీద. ఒకవేళ తీశానే అనుకోండి- నాకామా

త్రం సొహంతరంలేదా? నా మొగుడు దాల్చీలతో చెమటోడ్చి సంపాదిస్తే అందులో నే తీస్తే తీస్తాను, నా యిష్టం. నాకు లీవుశాలరీ యివ్వనక్క ర్లేదా? నాకు లీవుశాలరీ యివ్వాలనుకోవాలిగాని కేడీ దాన్ని చూసినట్లు చూస్తే ఎలాగ? మూతి మూరెడు చేసుకు కూర్చుంటే కూర్చోండి.

చేతులు కలిసిన చప్పట్లు-

మనసులు కలసిన ముచ్చట్లు:

ఒక వేళ నేను తీసి దాచినా మన చితుకుల మంట సంసారానికి అవసరం వస్తే వాడ్తా- నా దగ్గర బెల్లించి లాగిన ఐదులు పదులూ అన్నీ మర్చేపోయారా? ఆవన్నీ ఒకచోట వేసి కూడండి. దానికిచ్చే వడ్డీకి సరి పోదు మీ పర్సులోంచి తీసిన నలభై రూపాయలూ- మార్చి పాడు చేస్తా నంటారా? నేను పాడు చేసేదాన్ని మీరు బాగుచేసేవారు. ఆ నోట్లు అసలు అసలు సిగరెట్లు కంపు కొడుతున్నాయని ఎండలో పెట్టి కలరా వుండవేసి కార్యానికి మీ వాళ్ళు పెట్టిన బెనారెస్ చీర- ఆదేలెండి దాని కొంగునేగా మీరో కాసు ముడి వేస్త. అందులో జాగర్త చేశా. అడిగితే యివ్వొచ్చు నని. మీతో చెప్పాలా- చెప్పాలి చెప్పాలి; అన్నీ మీరు నాకు చెప్పే చేస్తు న్నారు. చూస్తున్నాగా. మరి అట్టే రేగనివ్వకండి. "ఇద్దరి మధ్య పొందిక వుంటే- రానే రావు పొరపాట్లు" అన్నాడు సినీమావాడు.

ఏమిటి నేను సినిమాలు కోట్ చేస్తున్నానా- యింకా నయం; నేను భగవద్గీత కోట్ చేస్తే మీరిక్కడ్నుంచి పారిపోయేవారు. మీరేమో కోపంగా, సీరియస్‌గా, చీత్తూ వుంటే మీకు భక్తి రాగ్యాలూ ఉపదేశిం చనా, మిరియాల కషాయం కాచి యిచ్చినటు.

"అలుక సరదా మీకు

అదే వేడుక మాకు

కడకు మురిపించి గెలిచేది మీరేగా."

ఎందుకంటీ నవ్వు వస్తోంటే పళ్ళు బిగిస్తారు నవ్వు వస్తూంటే ఆపుకోకూడదు, నవ్వుల పాలైపోతారు.

"నేడు శ్రీవారికి మేమంటే పరాకా

ఎందుకో తగని బలే చిరాకా"

హమ్మయ్య: ఒక్క మీ చిరునవ్వుకోసం ఒక ఆడది అనగా స్త్రీ మరియు ఇంటికి దీపం యిన్ని వైలాగులు చెప్పాలా. లెండి. లేచి బాత్ రూంలో కెళ్ళి కళ్ళు మొహం కడుక్కు రండి,

"నీ వెవ్వరివో చిరునవ్వుల

నీరూపు నను, మంత్రించే

మది పొంగి పొంగి పులకించె"

నేనెవరి నేమిటి. మీ పర్సులోంచి నలభై రూపాయలు తీసిదా చిన దాన్ని నేనే. ఇవిగో టేక్ టేక్ యువర్ పార్టీ రూపీస్ ... ఉన్న దంతా తగలేస్తారని తీసి దాచా. ఆమాత్రానికి షేక్స్పియర్ మొహం పెట్టుగుని కూర్చున్నారు. ఐ పిటీ యు. అసలు మీ డబ్బు నాక్కరలేదు ఐడోంట్ కేర్.... ఐ లైక్ ఓల్డు సినిమా పాటలు

"అలుక సరదా మీకు. అదే వేడుక మాకు

ఈనోట్లు నలిగిపోతే మీ పాంట్ మడతల్లో పెట్టి ఇస్త్రీ చేయించా క్రొత్తగా ఎలా రెపరెప లాడు తున్నాయో చూశారా? ఆశల సరదాల్లా కోరికల తోరణాల్లా ఘుమఘుమ లాడుతున్నాయి. ఇవి ఎన్ని చేతులు మార తాయో.... ఎంతమంది ఆశల్ని త్రుంచేస్తాయో.... ఒద్దండి డబ్బు మన కొద్దు ఆ పాపిష్టి డబ్బు మనసులో పెట్టుకునేగా యింతసేపూ మీ కుళ్ళు

మనసులో దొంగ రాస్కెలుగా చిత్రించుకుని బాధపడింది. మీకు పూర్తిగా కోపం పోవాలంటే ఏ పాట జ్ఞాపకం చేస్తే బాగుంటుందీ _ ఆఁ

"రావిచెట్టు క్రింద మయ్యాలా -

రంగు రంగుల తూగుటుయ్యాలా-

ఇంత పెద్దదాన్నయాక యిప్పుడు ఊయల ఊగాలనివున్నా - ఊగ లేను క్రిందపడి పోతానేమో, చట్టు విరుగుతుందని భయం; అందుకనీ-

బౌరారా - పిలచిన బిగువటరా"

అరే ఎందుకు నోరు చేత్తో మూసేస్తారు నేను అంటంలేదు. పాటలో అలా వుంది. మీరు చూడలా ఆ పిక్చరు. మరింకేం బౌరార ఒరే" అనిపాటల్లో వుంటాయి - వుండనీయండి. మన సొమ్మేంపోయింది? భోజనాలకు లేద్దామా- ఎందుకూ ఒక కంఠం చాలంటారా? అబ్బ ఎంతాశ-